RNI No: APTEL/2018/76747

# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | గురువారం | సంపుటి: 9 | సంచిక: 231 | పేజీలు: 04 | వెల: 5 /- | 20 ఆగస్టు 2026 |




## అసలేంటి సెక్షన్ 22-ఏ?

- తెలంగాణలో వేలాది ప్రైవేట్ ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాల్లో చేరిక
- రిజిస్ట్రేషన్లు, అమ్మకాలు నిలిచిపోవడంతో యజమానుల ఆందోళన
- అధికారుల తప్పిదమే కారణమని అంగీకరించిన ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష, దిద్దుబాటు చర్యలకు ఆదేశం
- మంత్రి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాల డిమాండ్

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

### అసలేంటి సెక్షన్ 22-ఏ? పొరపాటు ఎలా జరిగింది?

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తుల్లు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.



మిగతా 4లో..

# రూ.20 లంచం కేసు..



### 30 ఏళ్ల తర్వాత ఇద్దరు ఉద్యోగులకు సుప్రీం ఊరట

కేవలం రూ. 20 లంచం ఆరోపణలతో మూడు దశాబ్దాలు పాటు సాగిన సుదీర్ఘ న్యాయపోరాటానికి సర్వోన్నత న్యాయస్థానం తెరదించింది. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను నిర్దోషులుగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ట్రయల్ కోర్టు, హైకోర్టు విధించిన శిక్షలను రద్దు చేస్తూ వారికి పూర్తి ఊరట కల్పించింది. కేసు నేపథ్యం పరిశీలిస్తే, 1996 ఫిబ్రవరిలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా బెచారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యాపరమైన రాయితీల నిమిత్తం ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఇన్‌కమ్ సర్టిఫికెట్) కోసం ఒక విద్యార్థి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, అక్కడి క్లర్క్ రూ. 120 (తనకు రూ. 100, ప్యూన్‌కు రూ. 20) లంచం డిమాండ్ చేశాడని సదరు విద్యార్థి అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) ఫిర్యాదు చేశాడు.

బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రంగు పూసిన నోట్లతో ఉచ్చు పన్నారు. సర్టిఫికెట్ అందుకున్న అనంతరం విద్యార్థి, ప్యూన్‌కు రూ. 20 ఇచ్చాడు. ఆ నగదును అధికారులు ప్యూన్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. అయితే, క్లర్క్ డిమాండ్ చేశాడన్న రూ. 100 మాత్రం ఎక్కడా లభించలేదు.

జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. కేవలం నగదు రికవరీ అయినంత మాత్రాన లంచం తీసుకున్నట్లు మిగతా 4లో..

## సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలు

- **ఖండించిన వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి**



అమరావతి, నవతరం: డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవినీతికి సమాధానం చెప్పలేక సీనియర్ నాయకులు , శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పై మంత్రి అచ్చం నాయుడు వ్యక్తిగత విమర్శలకు దిగడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, పాడేరు మాజీ శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలను వారికి నచ్చిన వారికి నచ్చినట్టుగా అమ్ముకున్నారన్నది పక్కా ఆధారాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బట్టబయలు చేయడంతో దీనిపై సత్యనారాయణ శాసనమండలి వేదికగా సిబిఐ విచారణకు డిమాండ్ చేశారని దానికి సమాధానం చెప్పలేక ఆ విషయాన్ని డైవర్ట్ చేయడం కోసం వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్నారు. సభలో గౌరవ మర్యాదలు పాటించాలన్న విజ్ఞతను మరిచి శాసన మండలి ప్రతిపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బయట ప్రజలు నవ్వుకుంటున్నారని విషయం కూటమి నాయకులకు అర్థమై దాన్నుంచి ప్రజల దృష్టి మరలచడానికి కొత్త డ్రామాకు తెరతీసారన్నారు. ఈరోజు రాష్ట్రమంతటా డీఎస్సీలో జరిగిన అవకతవకలపై చర్చలు నడుస్తుంటే దానికి సమాధానం చెప్పడం తలనొప్పిగా మారిన నేపథ్యంలో దాని నుంచి ప్రజల ఆలోచనలను డైవర్ట్ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో పిసిసి అధ్యక్షులుగా పనిచేసిన నాయకులు, ఉత్తరాంధ్ర కే వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి బొత్స సత్యనారాయణ పై మంత్రి కింజారపు అచ్చం నాయుడు వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. చేతనైతే ప్రతిపక్ష నాయకుడు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి తప్ప ఇలా వ్యక్తిగత దూషణల వల్ల ప్రభుత్వం చేసిన తప్పు ఒప్పు అవదు అన్నారు. ఒకపక్క నేరుగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని లోకేష్, చంద్రబాబు నాయుడు పరోక్షంగా ఒప్పుకుంటూనే ఎప్పుడో రెండేళ్ల క్రితం జరిగిన గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీపై కూడా సిపిఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. డీఎస్సీ పై సిబిఐ విచారణ చేపడితే గ్రూప్ 1 నియామకాలపై కూడా సిబిఐ విచారణ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారంటే పక్కాగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఒప్పుకుంటున్నారన్నారు. గౌరవ శాసన మండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ గ్రూప్ -1 లో అవకతల పై సిబిఐ విచారణ జరిపించాలని దానిని తాము ధైర్యంగా ఎదుర్కోగలమని కోరినందుకు కూటమి నేతలు భయపడుతున్నారన్నారు. గ్రూప్ 1 నియామకాలు జరిగి రెండేళ్లయినా ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం దానిపై ఎందుకు నోరు ఎత్తలేదు అన్నారు. నిజంగానే అవకతవకలు జరిగి ఉంటే అధికారంలోకి వచ్చిన వెంటనే సిబిఐ ఎంక్వైరీ వేయించే వారన్నారు. అది చేయకుండా వారి చేసిన తప్పును వైఎస్ఆర్సిపి ఎత్తిచూపుతోందని ఇప్పుడు గ్రూప్ 1 గురించి మాట్లాడుతున్నారన్నారు. ఇప్పుడైనా సరే డీఎస్సీ పైన గ్రూప్ 1 పైన సిబిఐ విచారణకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అంగీకరించడంతో తాము చేసిన తప్పు బయటపడిపోతుందని ఈ విధంగా వ్యక్తిగత విమర్శలు దిగుతున్నారన్నారు. శాసనమండల్లో ప్రభుత్వ నేతల ప్రవర్తనను ప్రజలంతా గమనిస్తున్నారని చట్టసభల్లో ప్రశ్నించే వారిపై ఇలా వ్యక్తిగతల విమర్శలు దిగడం సరికాదన్నారు.

## సుజలాం వాటర్ ప్లాంట్‌లో... అసలేం జరుగుతోంది?













సుజలాం వాటర్ ప్లాంట్‌లో అసలేం జరుగుతోంది .. మిగతా.. 4లో

# మా తోటలు తాకితే ఊరుకోం

- మందసలో కార్గో ఎయిర్‌పోర్ట్
- మా భూములు ఇవ్వం.. మా ప్రాణాలు తీసినా సరే
- వేల ఉద్యోగాలు అంటారు.. కానీ ఒక్కటి కూడా మాకు రాదు
- బంజరు భూములు ఉండగా తోటలే ఎందుకు?



పలాస, నవతరం: ఉద్దానం ప్రాంతంలోని పలాస నియోజకవర్గం మందస ప్రాంతంలో కార్గో విమానాశ్రయం ప్రతిపాదనపై స్థానిక ప్రజానీకం గత కొంతకాలంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న ఈ ప్రాంతంలో జీడి తోటలు, కొబ్బరి తోటలను సేకరించడాన్ని రైతులు, ప్రజా సంఘాలు నిరసిస్తున్నాయి. ప్రాజెక్టు పేరుతో తమ జీవనోపాధి దెబ్బతింటుందని, భవిష్యత్ తరాలకు తోటలు మిగలవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మందస ప్రాంతంలో ప్రతిపాదిత కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం జీడి, కొబ్బరి తోటల సేకరణ ప్రక్రియపై రైతుల నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. తరతరాలుగా పెంచుకుంటున్న జీడి తోటలు, కొబ్బరి తోటలు కోల్పోతే తమ జీవనాధారం పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. “మా భూములు మా ప్రాణాలు.. మేము ఇవ్వము” అనే నినాదాలతో ప్లకార్డులు పట్టుకుని రైతులు నిరసనలు చేపట్టారు. తోటలే తమకు ఏకైక ఆధారం అని, భూములు లేకుండా పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని రైతులు పేర్కొన్నారు. భూగర్భ జలాలు తగ్గి ప్రాంత వ్యవసాయ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుందని, పునరావాస ప్యాకేజీపై ఎలాంటి స్పష్టత లేదని, ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం తమ అవసరాలకు సరిపోదని రైతులు తెలిపారు. ఈ ప్రాంతం జీడి, కొబ్బరి ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రముఖంగా ఉందని, ఏటా వేలాది టన్నుల దిగుబడి ఇక్కడి నుంచే వెళుతుందని రైతులు గుర్తు చేశారు. తోటలను తొలగిస్తే వందలాది కుటుంబాలకు నష్టం జరుగుతుందని, కూలీల ఉపాధి కూడా పూర్తిగా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా భూములు తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా కష్టపడి తయారు చేసుకున్న తోటలను ఒక్క కలంతో నాశనం చేయడం తగదని, తమ పూర్వీకుల రక్తంతో తడిసిన నేలను వదులుకోలేమని రైతులు ఆవేదన చెందారు. కార్గో ఎయిర్‌పోర్ట్ వల్ల స్థానికులకు వేలాది ఉద్యోగాలు వస్తాయనే ప్రచారంపై రైతులు అనుమానాలు వ్యక్తం చేశారు. “వేల ఉద్యోగాలు అంటారు.. కానీ ఒక్కటి కూడా మాకు రాదు” అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదిత ప్రాజెక్టు పూర్తిగా ఆటోమేటెడ్ కార్గో టెర్మినల్ కావడంతో స్థానిక యువతకు అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన ఉద్యోగాలు అన్నీ బయటి రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల వారితోనే భర్తీ అవుతాయని, స్థానికులకు నిర్మాణ సమయంలో తాత్కాలిక కూలీ పనులు మాత్రమే దక్కుతాయని పేర్కొన్నారు. శాశ్వత ఉద్యోగాలకు ఎలాంటి హామీ లేదని, ఉద్యోగాల పేరుతో రైతులను మభ్యపెట్టి భూములు లాక్కోవాలని చూస్తున్నారని రైతులు ఆరోపించారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి జాతీయ బీసీ సంక్షేమ నాయకురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు సిపాన గుణవతి, న్యాయవాది సిపాన ప్రసాద్ తీసుకువెళ్లారు. భారత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి రైతుల హక్కులను కాలరాస్తూ కార్గో విమానాశ్రయం నిర్మాణం చేపట్టకూడదని, రైతులు అంగీకరిస్తేనే ఏదైనా ప్రాజెక్ట్ చేపట్టాలని సుతిమెత్తగా హెచ్చరికలు జారీ అయినప్పటికీ, శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ఏదో విధంగా తమ పంతం నెగ్గించుకునేందుకు స్థానిక ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు హడావుడి చేస్తున్న తీరు పట్ల ఉద్దానం ప్రాంత రైతులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, వాటిని బేఖాతరు చేస్తూ, అత్యుత్సాహం చూపుతున్న జిల్లా కలెక్టర్ తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్రం ఆదేశాలను సైతం లెక్కచేయకుండా భూ సేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే పేరుతో అధికారులు పొలాల్లోకి రావడంతో రైతులు అడ్డుకుంటున్నారు. పోలీసులను, రెవెన్యూ సిబ్బందిని చూసి రైతులు భయపడడం లేదని, చివరి వరకు పోరాడతామని స్పష్టం చేశారు. మండల పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ బంజరు భూములు అందుబాటులో ఉండగా వాటిని పక్కన పెట్టి జీడి, కొబ్బరి తోటలనే ఎందుకు ఎంచుకున్నారని రైతులు ప్రశ్నించారు. “బంజరు భూములు ఉండగా తోటలే ఎందుకు?” అంటూ నిలదీశారు. పర్యావరణంపై ప్రభావం, నీటి వనరుల కాలుష్యం, శబ్ద కాలుష్యం వంటి సమస్యలు వస్తాయని, గ్రామాల ప్రశాంత దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉద్దానం ప్రాంతం ఇప్పటికే మూత్రపిండాల వ్యాధితో సతమతమవుతుండగా, ఇలాంటి ప్రాజెక్టులు మరింత సమస్యలు తెస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో రైతులను నిర్వాసితులను చేయడం సరికాదని, తోటలకు బదులు ప్రభుత్వ భూముల్లోనే కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. “మా భూములు మాకే కావాలి – మా భవిష్యత్తు మాదే నిర్ణయించుకుంటాం” అని రైతులు ఐక్యంగా నినదించారు. ఈ అంశంపై రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, బీసీ సంఘాల నేతలు రైతులకు సంఘీభావం ప్రకటించారు. పలు గ్రామాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించి ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేశారు. మహిళలు సైతం రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మాజీ ప్రియులను కలుసుకునే ప్రేమ సంత..

- ఏడాదికి ఒక్కరోజే అక్కడ సందడి!



హైదరాబాద్, నవతరం: ప్రేమలో ఓడిపోయిన వాళ్లు మళ్లీ కలుసుకుంటే ఏం జరుగుతుంది? గొడవలు, అసౌకర్యం, ఇబ్బందికరమైన పరిస్థితులు గుర్తొస్తాయి. కానీ వియత్నాంలో మాత్రం మాజీ ప్రేమికులను కలుసుకోవడానికే ఓ ప్రత్యేక సంత జరుగుతుంది. ఏడాదికి ఒక్కరోజు జరిగే ఈ వేడుకలో ఒకప్పుడు ప్రేమించుకున్నవారు మళ్లీ కలుసుకుని కాసేపు మాట్లాడుకుంటారు. స్థానిక సంస్కృతిలో ఇదొక ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగుతోంది.

ఓ ప్రేమకథతో మొదలై..

వియత్నాంలోని హా జియాంగ్ ప్రావిన్స్‌లో జరిగే ఈ వేడుకను 'ఖావు వై లవ్ మార్కెట్'గా పిలుస్తారు. దాదాపు వందేళ్ల క్రితం జరిగిన ఓ ప్రేమకథ ఈ సంప్రదాయానికి కారణమైంది. నుంగ్ తెగకు చెందిన 'బా' అనే యువకుడు గియాయ్ తెగకు చెందిన 'ఉత్' అనే యువతిని ప్రేమించాడు. ఇద్దరి కుటుంబాలు, సంప్రదాయాలు వేరు కావడంతో వారి ప్రేమకు అడ్డంకులు ఎదురయ్యాయి. కుటుంబాల మధ్య గొడవలు జరగకూడదని భావించిన ఆ ప్రేమికులు ఓ నిర్ణయానికి వచ్చారు. ఏడాదికి ఒక్కసారి ఖావు వైలో కలుసుకోవాలని అనుకున్నారు. ఆ చిన్న నిర్ణయమే కాలక్రమంలో ఓ సంప్రదాయంగా మారింది.

ఏడాదికి ఒక్కసారి..

చంద్ర క్యాలెండర్ ప్రకారం మూడో నెల 27వ రోజున ఈ లవ్ మార్కెట్ జరుగుతుంది. సాధారణంగా ఏప్రిల్ లేదా మే నెలల్లో ఈ వేడుక ఉంటుంది. వివిధ గిరిజన వర్గాలకు చెందిన ప్రజలు ఇక్కడకు చేరుకుంటారు. ఒకప్పుడు ప్రేమించిన వ్యక్తులను కలుసుకోవడానికి మాజీ ప్రేమికులు వస్తారు. కాసేపు మాట్లాడుకుంటారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. ఆ తర్వాత ఎవరి దారిలో వారు వెళ్లిపోతారు. పాటలు.. నృత్యాలు.. పండుగ వాతావరణం ఇది కేవలం మాజీ ప్రేమికుల కలయికతోనే ముగిసిపోదు. సంప్రదాయ దుస్తుల్లో ప్రజలు సందడి చేస్తారు. జానపద పాటలు, నృత్యాలు, స్థానిక వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పెళ్లి కానివారు తమకు నచ్చిన జీవిత భాగస్వామిని వెతుక్కోవడానికి కూడా ఈ వేడుకను మిగతా 4లో..

# ఇంటర్ బోర్డులో విజిలెన్స్ సోదాలు..

**మళ్లీ తెరపైకి 2019 ఫలితాల వివాదం!**

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం మరోసారి వార్తల్లో నిలిచింది. నాంపల్లిలోని బోర్డు కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంటల పాటు ఈ సోదాలు నిర్వహించడంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది.

2019 నాటి ఇంటర్ ఫలితాల వివాదానికి సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. అప్పట్లో ఫలితాల వెల్లడి బాధ్యతలను నిర్వహించిన గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థ అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణలు పెను దుమారం రేపాయి. మార్కుల కేటాయింపులో జరిగిన పొరపాట్ల కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

తాజాగా ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ విభాగం విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగానే అధికారులు ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సోదాలకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.



# కూతురి సంచలన వ్యాఖ్యలు..

- మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసు.
- సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై వివరణ కోరిన కమిటీ
- మూడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం
- మాజీ మంత్రి చిన్నారెడ్డికి కూడా షోకాజ్ నోటీసు
- వనపర్తి ఎమ్మెల్యేపై వ్యాఖ్యలపై చిన్నారెడ్డి షోకాజ్



హైదరాబాద్, నవతరం: తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు సంబంధించి మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన బహిరంగ వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి సురేఖ నుంచి వివరణ కోరింది. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రభుత్వ పెద్దలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై మూడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని సురేఖను ఆదేశించింది.

ఇటీవల జరిగిన ఓ సభలో రేవూరి ప్రకాశ్ రెడ్డిని మరోసారి గెలిపించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన సుష్మిత.. అధిష్ఠానాన్ని సంప్రదించకుండా మీరెలా అభ్యర్థిని ప్రకటిస్తారని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. టికెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా పరకాల నుంచి తాను పోటీ చేసి గెలిచి తీరతానని తేల్చి చెప్పారు.

**చిన్నారెడ్డికి కూడా నోటీసు**

మరోవైపు వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లోనూ వివాదం తెరపైకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యేపై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. తన వ్యాఖ్యలపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. డబ్బులు తీసుకొని ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని ఇటీవల చిన్నారెడ్డి ఆరోపించారు. అందుకే తనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీటు రాలేదని పేర్కొన్నారు. ఫలితంగా వనపర్తి నియోజకవర్గాన్ని నాశనం చేశారని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని.. అవినీతికి పాల్పడేవారిని బయటకు గెంటేస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

సొంత పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నేతలపై పార్టీ లైన్ దాటి బహిరంగంగా విమర్శలు చేస్తే సహించబోమని క్రమశిక్షణ కమిటీ హెచ్చరించినట్లు సమాచారం. ఇద్దరు సీనియర్ నేతలకు ఒకేసారి నోటీసులు జారీ కావడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ చర్చ మొదలైంది. పార్టీ టికెట్ల అంశం చుట్టూ కొనసాగుతున్న అసంతృప్తి ఈ పరిణామాలతో మరోసారి బయటపడినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో ఆత్మీయ సమావేశం

- వార్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటాం
- రాబోయే మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి
- పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్లగిరి బాబు

**పలాస, నవతరం:** ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ ధ్యేయమని పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్లగిరి బాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో వైఎస్‌ఆర్సీపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డులోని ప్రస్తుత పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బల్లగిరి బాబు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్‌ఆర్సీపీని అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతంలో వైఎస్‌ఆర్సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేసి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. వార్డులో శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, వీధి లైట్లు సరిగా వెలుగకపోవడంతో రాత్రి సమయాల్లో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త సకాలంలో తీయకపోవడం వల్ల దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగిందని తెలిపారు. అదేవిధంగా వార్డులోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం పడితే మురికి నీరు రోడ్లపై నిలుస్తుందని చెప్పారు. దీనివల్ల ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇంకా పెన్షన్లు మంజూరు కాలేదని, దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యలన్నింటినీ మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కోసం తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరుకోళ్ల వెంకటరమణ, సనపల చెన్నారావు, ఎక్స్ కౌన్సిలర్ రోణంకి వెంకటరమణ, డి. నాగభూషణరావు, వల్లభ వైకుంఠరావు, వార్డులోని యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మార్వో ను కలిసిన కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ తో కలిసి ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించారు మహదేవపురం కాలనీవాసులు. మన మహాదేవపురం కాలనీ 329/4 TO 329/10 సర్వే నంబర్లకు సంబంధించిన రెవెన్యూ సమస్యపై పరిష్కరణ దిశగా తగు చర్యలను తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కూన శ్రీశైలం గౌడ్ కోరుతూ... దీనిపై అతి త్వరలోనే ఫ్లాట్ యజమానులందరినీ మంత్రి వద్దకు తీసుకువెళ్లి, న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్ దుగ్యాల, ఉపాధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, రంగారావు, జాయింట్ సెక్రటరీలు రామచంద్రారెడ్డి, ప్రవీణ్ కుమార్, సొసైటీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, దిలీప్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు, నరేందర్ రెడ్డి, తదితర సొసైటీ సభ్యులు, ఫ్లాట్ యజమానులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# అమ్మ ఆకాశం... నాన్న అంతరిక్షం..!



రచన
పోలయ్య కూకట్లపల్లి

అమ్మ ఒడిలోనే –
ఆగాయి నా కన్నీటి ధారలు
అమ్మ ప్రేమ –
ఆకాశానికే అందని అమృతధార
అమ్మ మాట –
అలసిన మనసుకు చల్లని జలధార

నేను పడిన ప్రతిసారీ –
లేపిన మమతా మూర్తి అమ్మ
నేను ఓడితే ప్రతిసారీ –
ఓదార్చిన ఓర్పుల దీపం అమ్మ

అమ్మ ఒడి ఒక ఆకాశపు హాయి
అమ్మ మాట ఓ అమృతబిందువు
అమ్మ చేతుల్లో మమతా మాధుర్యం
అమ్మ కన్నుల్లో వెన్నెల వైభవం

నా మౌనంలో దాగిన బాధను
ఆవేదనా అక్షరాలను చదివే
మాతృహృదయం అమ్మది...
నా నవ్వుకోసం తన కన్నీటిని
కనురెప్పల మాటున
దాచిన అనురాగ సముద్రం అమ్మ

నా అడుగులకు
ఆరనిదీపమై దారిచూపింది అమ్మ
నా జీవితానికి
తొలి పొద్దు వెలుగై నిలిచింది అమ్మ

నాన్న చూపుల్లో –
కనిపిస్తాయి నాకు
రేపటి వెలుగు దారులు
నాన్న నీడ –
ఎండలో నడిచే ధైర్యవృక్షం
నాన్న మాట –
చీకటిలో దారిచూపే దీపస్థంభం

నేను పడితే తడబడితే
నిలబెట్టే నమ్మకపు కొండ నాన్న
నేను వెనుకడుగు వేస్తే
ముందుకు నడిపే గుండె నాన్న

నాన్న నీడలో నిశ్చింత నడక
నాన్న మాటలో నమ్మకపు వెలుగు
నాన్న భుజమే నాకు బలమైన బాట,
నాన్న ధైర్యమే నాకు విజయగీతిక

నా కలల కోసం తన కలలనే
మౌనంగా మరచిన త్యాగమూర్తి నాన్న
నా గెలుపుకోసం తన ఓటమినే
ఒడిలో దాచుకున్న సమరయోధుడు నాన్న

అమ్మా... నా ఆకాశం
నాన్నా... నా అంతరిక్షం
అమ్మ ... నా అమృత వర్షం
నాన్న ... నా కలల కల్పవృక్షం
అమ్మకు తెలుసు – నా ఆకలి కేకలు
నాన్నకు తెలుసు – నా ఆశల రేఖలు

అమ్మ మమత...జీవనానికి ఊపిరైతే
నాన్న ధైర్యం... జీవితానికి దిక్సూచి
ఆ ఇద్దరున్న ఇల్లే ఇంద్రభవనం
అది ఓ నవ్వుల నందనవనం
అది ఓ సంతోషాల స్వర్గసీమ
అమ్మ ప్రేమ–నాన్న బలం
మా జీవితానికి రెండు రెక్కలు

వారి ఆశీర్వాదాలే మాకు దారిదీపాలు
వారే ఈ జన్మకు తెరిచిన స్వర్గద్వారాలు
వారి చల్లని చూపులే
మాకు స్వర్ణాభరాణాలు
వారి మాటలే మాకు మంగళ తోరణాలు
వారి ఆదర్శాలే మాకు వెలుగు కిరణాలు

అమ్మా నాన్నలే – మాకు రెండు కన్నులు
అమ్మా నాన్నలే – మాకు ప్రత్యక్ష దైవాలు

అమ్మ అంటే–
అనంతమైన ఆప్యాయతకు ప్రతిరూపం...
నాన్న అంటే–
నా బంగారు భవిష్యత్తుకు భరోసా దీపం..!




# సుజలాం వాటర్ ప్లాంట్‌లో... అసలేం జరుగుతోంది?

- లీజు ముగిసినా కొనసాగుతున్న నిర్వహణపై ప్రశ్నలు.. ధరల పట్టిక ఏది?
- ప్రశ్నించిన విలేకరి ఫోన్ లాక్కునే ప్రయత్నం జరిగిందంటూ ఫిర్యాదు
- సమాచార హక్కు చట్టం ద్వారా చర్యలు లేవని అధికారుల సమాచారం
- కోర్టు వ్యవహారం కొనసాగుతుండగా.. అధికారుల వైఖరిపై అనుమానాలు

ఖమ్మం – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవతరం: అశ్వారావుపేట పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలో ఉన్న సుజలాం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు తక్కువ ధరకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ నిర్వహణపై ఇప్పటికే పలు ప్రశ్నలు తలెత్తుతుండగా.. తాజాగా ప్లాంట్ వద్ద ధరల పట్టిక ఎందుకు లేదని తెలుసుకునేందుకు వెళ్లిన విలేకరితో నిర్వాహకుడి మధ్య జరిగిన పరిణామాలు కలకలం రేపుతున్నాయి.

**ధరల పట్టిక కోసం వెళ్లిన విలేకరి**

ప్లాంట్ వద్ద అధికారిక ధరల పట్టిక కనిపించకపోవడంతో.. దాని వివరాలను తెలుసుకునేందుకు విలేకరి అక్కడికి వెళ్లి వీడియో చిత్రీకరణ చేపట్టారు. ఆ సమయంలో ప్లాంట్ నిర్వాహకుడు వినుకొండ శ్రీనివాసరావు అక్కడ లేకపోవడంతో ఆయన భార్యను విలేకరి ధరల పట్టిక గురించి ప్రశ్నించినట్లు తెలిపారు. దానికి ఆమె.. "ఓనర్ గారు లేరు.. ఆయన వచ్చిన తర్వాత అడగండి.. బయటకు వెళ్లారు" అని సమాధానం ఇచ్చినట్లు విలేకరి వెల్లడించారు. అనంతరం అక్కడి నుంచి వస్తుండగా నిర్వాహకుడు ఎదురై.. ఎవరు మీరు? ఎందుకు వీడియోలు తీస్తున్నారు? మీకు సంబంధం ఏమిటి? అంటూ ప్రశ్నించినట్లు తెలిపారు.

**ఫోన్ లాక్కునే ప్రయత్నం జరిగిందంటూ ఆరోపణ.**

ప్లాంట్ ప్రజలకు సంబంధించిన సేవ అని, ధరచేసి తుది పరిష్కారం వచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన సుజలాం ప్లాంట్.. ప్రజలకే అందుబాటులో ఉండాలి. ప్రజా ఆస్తి విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా అధికారులు పూర్తి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టిక ఎందుకు లేదో తెలుసుకునేందుకే వీడియో తీస్తున్నానని విలేకరి సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఈ క్రమంలో నిర్వాహకుడు తన చేతిలోని ఫోన్‌ను లాక్కునే ప్రయత్నం చేశారని విలేకరి ఆరోపించారు. ఈ పరిణామంపై ఇప్పటికే అత్యవసర పోలీసు నంబరు వందకు సమాచారం అందించడంతో పాటు.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విలేకరి తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

**పశువైద్యశాల సిబ్బంది వీడియోలు ఎందుకు తీశారు?**

ఇదే సమయంలో మరో అంశం చర్చకు దారితీసింది. ప్లాంట్ నుంచి బయటకు వచ్చిన అనంతరం పక్కనే ఉన్న పశువైద్యశాలకు చెందిన వైద్యుడు, కాంపౌండర్ తనను, తన వీడియోలను చిత్రీకరించినట్లు విలేకరి తెలిపారు. సుజలాం ప్లాంట్ వ్యవహారంతో పశువైద్యశాల సిబ్బందికి ప్రత్యక్ష సంబంధం ఏమిటి? వారు విలేకరి వీడియోలను ఎందుకు చిత్రీకరించాల్సి వచ్చింది? ఎవరైనా సూచించడంతో చిత్రీకరించారా? లేక అక్కడ జరిగిన పరిణామాలను సాధారణంగా రికార్డు చేశారా? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశంపైనా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**పది సంవత్సరాల ఒప్పందం ముగిసినా నిర్వహణ ఎలా?**

సుజలాం ప్లాంట్‌కు సంబంధించి 2010లో ఎం/ఎస్ ఏటీఎమ్ వాటర్ సిస్టమ్స్‌కు చెందిన వినుకొండ శ్రీనివాసరావుకు పది సంవత్సరాల బూట్ ఒప్పందం కింద ప్లాంట్ అప్పగించినట్లు సమాచారం. ఆ ఒప్పంద కాలం 2020 జూన్‌తో ముగిసినట్లు సంబంధిత వివరాలు సూచిస్తున్నాయి.

అయితే ఒప్పంద కాలం ముగిసిన తర్వాత కూడా ప్లాంట్ నిర్వహణ కొనసాగుతున్నట్లయితే.. దానికి ప్రస్తుతం చట్టబద్ధమైన ఆధారం ఏమిటన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

**2018 పొడిగింపు లేఖపై అనుమానాలు**

2018లో అప్పటి పంచాయతీ కార్యదర్శి ద్వారా పది సంవత్సరాల పొడిగింపునకు సంబంధించిన లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆ లేఖకు గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం ఉందా? జిల్లా స్థాయి అధికారుల అనుమతులు ఉన్నాయా? అన్నది కీలక ప్రశ్నగా మారింది. అధికారిక అనుమతులు లేకుండా పొడిగింపు లేఖ ఇచ్చి ఉంటే.. దాని చట్టబద్ధత ఏమిటన్నదీ తేలాల్సి ఉంది. ఈ వ్యవహారంపై అప్పట్లో సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ, విచారణ జరిగిందా? అన్న ప్రశ్నలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి.

**హైకోర్టు వ్యవహారం.. తాత్కాలిక ఉత్తర్వులపై ప్రశ్నలు**

ఈ పొడిగింపు లేఖను ఆధారంగా చేసుకుని ప్లాంట్ నిర్వాహకుడు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి తాత్కాలిక ఉత్తర్వులు పొందినట్లు సమాచారం. కేసు ప్రస్తుతం కొనసాగుతున్నట్లు అధికారుల నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన పత్రాల్లో పేర్కొన్నట్లు విలేకరి తెలిపారు. అయితే తాత్కాలిక ఉత్తర్వు తుది తీర్పు కాదన్న విషయం నేపథ్యంలో.. కేసులో ప్రభుత్వ విభాగాల తరఫున ఇప్పటివరకు ఏ న్యాయపరమైన చర్యలు తీసుకున్నారు? కౌంటర్ దాఖలు చేశారా? కేసును త్వరగా తుది పరిష్కారానికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారా? అన్నది అధికారులు వెల్లడించాల్సి ఉంది.

**సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిన అంశాలు**

సుజలాం ప్లాంట్ వ్యవహారంపై విలేకరి ఇప్పటికే అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్‌కు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు తెలిపారు. దానికి సంబంధించి అధికారులు కోర్టు ఉత్తర్వుల ప్రతిని అందించడంతో పాటు.. కేసు కొనసాగుతున్నట్లు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. అంతేకాకుండా.. ప్లాంట్‌పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అధికారుల నుంచి వచ్చిన సమాచారంలో స్పష్టమైనట్లు విలేకరి తెలిపారు. ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కేసు కోర్టులో కొనసాగుతున్నా.. ప్లాంట్‌పై చర్యలు తీసుకోకుండా ఉండటానికి న్యాయపరమైన కారణం ఏమిటి? ప్రభుత్వ ఆస్తి వినియోగంపై సంబంధిత శాఖలు ఇప్పటివరకు ఏ చర్యలు చేపట్టాయి? మున్సిపాలిటీగా మారిన తర్వాత ప్లాంట్‌పై మున్సిపల్ యంత్రాంగం వైఖరి ఏమిటి? అన్నది ప్రజలకు తెలియాల్సి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మున్సిపాలిటీకి బాధ్యత మారిందా? ఈ అంశంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదించగా.. అశ్వారావుపేట గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా మారిన నేపథ్యంలో ప్లాంట్ ప్రస్తుతం తమ పరిధిలో లేదని, మున్సిపల్ కమిషనర్ పరిధిలోని అంశమని సంబంధిత అధికారి తెలిపినట్లు సమాచారం. మరి ప్లాంట్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చినట్లయితే.. దాని ఆస్తి, నిర్వహణ, ఒప్పందాలు, ప్రస్తుత హక్కులు, బాధ్యతలపై మున్సిపాలిటీ అధికారికంగా ఏ నిర్ణయం తీసుకుంది? అన్నది ప్రశ్న.

**ధరల పట్టిక లేకుండా నీటి విక్రయాలు?**

ప్రజలకు అందించే నీటి ధరలు స్పష్టంగా

ఇంకా చదవండి...

తెలిసేలా ధరల పట్టిక ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ప్లాంట్ వద్ద ధరల పట్టిక కనిపించడం లేదని విలేకరి తెలిపారు. దీంతో నీటి ధరలను ఎవరు నిర్ణయిస్తున్నారు? ప్రజల నుంచి ఎంత వసూలు చేస్తున్నారు? అధికారిక రసీదులు ఇస్తున్నారా? ఆదాయ వ్యయాల లెక్కలు ఎక్కడ ఉన్నాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశాలపై ప్లాంట్ నిర్వాహకుడు, సంబంధిత అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంది.

**అధికారుల మౌనం.. ప్రజల్లో అనుమానాలు**

సుజలాం ప్లాంట్‌పై ఇప్పటికే సమాచార హక్కు చట్టం ద్వారా పత్రాలు తీసుకున్నప్పటికీ.. సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడం, కోర్టు వ్యవహారం కొనసాగుతుండటం, మున్సిపాలిటీ పరిధి అంశంపై స్పష్టత లేకపోవడం, తాజాగా విలేకరితో వివాదం చోటుచేసుకోవడం వంటి పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు, అనుమానాలపై అధికారిక విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు**

సుజలాం ప్లాంట్ పది సంవత్సరాల ఒప్పందం ఎప్పుడు ముగిసింది? ఆ తర్వాత నిర్వహణ కొనసాగడానికి అనుమతి ఎవరు ఇచ్చారు? 2018లో ఇచ్చిన పొడిగింపు లేఖకు అవసరమైన తీర్మానాలు, అనుమతులు ఉన్నాయా? హైకోర్టులో కేసు ప్రస్తుతం ఏ దశలో ఉంది? ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేశారా? మున్సిపాలిటీగా మారిన తర్వాత ప్లాంట్‌పై ఎలాంటి చర్యలు చేపట్టారు? ధరల పట్టిక ఎందుకు లేదు? ప్రజల నుంచి వసూలు చేస్తున్న నీటి ధరలను ఎవరు నిర్ణయిస్తున్నారు? మరియు.. ప్రశ్నించిన విలేకరి ఫోన్ లాక్కునే పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సిన అవసరం ఉంది.

**ప్రజా ఆస్తి.. ప్రజల ప్రయోజనం**

సుజలాం ప్లాంట్ ప్రభుత్వ లక్ష్యంతో ఏర్పాటైన ప్రజా ప్రయోజన ఆస్తి అయితే.. దాని నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ప్లాంట్‌కు సంబంధించిన ఒప్పందాలు, పొడిగింపులు, కోర్టు ఉత్తర్వులు, అనుమతులు, ధరలు, నిర్వహణకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కోర్టు వ్యవహారం ఉన్నట్లయితే.. చట్టపరమైన ప్రక్రియను వేగవంతం

## అసలేంటి సెక్షన్ 22-ఏ?

**మొదటి పేజీ తరువాయి..** మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్‌ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సుమారు 6,000 కేసులు హైకోర్టులో నడుస్తున్నాయి.

**ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు**

ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్ల వల్లే ఇది జరిగిందని అంగీకరించారు. నిజమైన యజమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఫిర్యాదుల కోసం టోల్-ఫ్రీ నంబర్ (1800-599-4788) కూడా ప్రారంభించామని ప్రకటించారు. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లో స్పందిస్తామని హామీ ఇచ్చారు.

మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై మంత్రులు, అధికారు\లతో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న ఆస్తుల వివరాలను రెండు రోజుల్లో ధృవీకరించి, అవి ప్రైవేట్ ఆస్తులని తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. "ఒక్క అంగుళం ప్రైవేట్ భూమికి కూడా నష్టం జరగనివ్వం" అని స్పష్టం చేస్తూ, దళారులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

**ప్రతిపక్షాల విమర్శలు**

ఈ పరిణామంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని, డిసెంబర్ 2023 నుంచి జాబితాలో చేర్చిన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కొందరు అధికారులు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో లీగల్ ఎయిడ్ సెల్‌ను ప్రారంభించారు. బీజేపీ నేతలు కూడా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్క ప్రైవేట్ ఆస్తిని జాబితాలో చేర్చలేదని, కేవలం పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బాధిత యజమానులు తమ ఆస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## రూ.20 లంచం కేసు..

**రెండవ పేజీ తరువాయి..** నిర్ధారించలేమని, లంచం 'డిమాండ్' చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉండాలని ఈ సందర్భంగా ధర్మాసనం తేల్చిచెప్పింది.

ఫిర్యాదుదారుడైన విద్యార్థి వాంగ్మూలంలో పలు వైరుధ్యాలు ఉన్నాయని కోర్టు గుర్తించింది. ప్యూన్ తనను ఎప్పుడూ డబ్బు అడగలేదని విద్యార్థి క్రాస్ ఎగ్జామినేషన్‌లో అంగీకరించిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. పని పూర్తయిన తర్వాత డబ్బు ఇవ్వడం, "మరుసటి రోజు పండుగ కావడంతో విద్యార్థి తనకు ఆ నగదు ఇచ్చాడన్న" ప్యూన్ వాదన సహేతుకంగా ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. అలాగే క్లర్క్‌పై కేసు నమోదుకు ఉన్నతాధికారి ఇచ్చిన అనుమతి కూడా చెల్లదని పేర్కొంది. ఈ కారణాలతో దిగువ కోర్టుల తీర్పులను కొట్టివేస్తూ, 30 ఏళ్ల సుదీర్ఘ కేసుకు ముగింపు పలికింది.

## మాజీ ప్రియులను కలుసుకునే ప్రేమ సంత..

**మూడవ పేజీ తరువాయి..** ఉపయోగించుకుంటారు. వివాహిత జంటలు సైతం ఈ ఉత్సవంలో పాల్గొంటారు. కొందరు పాత స్నేహాలను గుర్తు చేసుకుంటారు. మరికొందరు తమ భాగస్వామితో కలిసి వేడుకను ఆస్వాదిస్తారు. జాతీయ వారసత్వంగా గుర్తింపు

2021లో వియత్నాం సాంస్కృతిక శాఖ ఖావు వై లవ్ మార్కెట్‌ను జాతీయ సాంస్కృతిక వారసత్వంగా గుర్తించింది. ప్రస్తుతం ఈ వేడుక స్థానిక పర్యాటకానికి కూడా ఆకర్షణగా మారింది. దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

ప్రేమ విఫలమైందంటే ఆ వ్యక్తితో శత్రుత్వమే ఉండాలనే భావనకు ఈ సంప్రదాయం భిన్నమైన ఉదాహరణ. గతం గతమేనని అంగీకరించి.. ఒకరోజు ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకుని.. మళ్లీ తమ జీవితాల్లోకి వెళ్లిపోవడం ఈ వేడుక ప్రత్యేకత.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism - NiMA) - Bureau Chief, Telangana, 9618907705,
E - mail: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com